ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

సోమవారం 20 అక్టోబరు 2025

రూ.384 కోట్లు విడుదల

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు, అతివృష్టి కారణంగా జరిగిన నష్టానికి గాను కేంద్రప్రభుత్వ హోం మంత్రిత్వశాఖ రూ.384 కోట్లు విడుదల చేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలకు ఎస్‌డీఆర్‌ఎఫ్‌లో బాగంగా రూ.1950 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారం ప్రకటించారు. కర్ణాటకకు రూ.384.40 కోట్లు, మహారాష్ట్రకు రూ.1,566.40 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. వరద నష్టానికి ఇవి ఉపయోగించుకోవాలన్నారు.

పేరుకే హరిత బాణసంచా..!

● సాధారణ టపాసులే విక్రయం ● నేడు దీపావళికి సర్వం సిద్ధం ● హోసూరు వైపు తరలుతున్న జనం



జయనగర్ మైదానంలో బాణసంచా విక్రయాలు

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చీకటిని పారద్రోలే వెలుగుల పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే ప్రమాదాలు జరగకుండా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. సమాజంలో కాలుష్యం పెరిగిపోతోందని టపాసుల వాడకం ద్వారా ప్రకృతికి భంగంతోపాటు వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందికర మని టపాసుల పొగతో పశుపక్షాదుల ఉనికికే ప్రమాదకరమని తరచూ హెచ్చరికలు వినిపిస్తుంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు ధర్మాసనాలు కొన్నేళ్లకాలంగా పర్యావరణానికి ఇబ్బంది లేకుండా హరిత బాణసంచా లనే కాల్చాలని ప్రచారంతోపాటు చైతన్యం తేవాలని ప్రభుత్వాలను ఆదే శిస్తోంది. అయితే దీపావళి వేళ విక్రయించేది మాత్రం సాధారణ టపాసులే. గతంలో టపాసులకు సాధారణ మైన లేబుల్స్ ఉండేవి. ఇటీవల లేబుల్స్ మార్చి గ్రీన్ టపాసులంటూ రాస్తున్నారు. కానీ లోపల ఉండేది మాత్రం సాధారణ టపాసులేనని స్పష్టం అవుతోంది. ఏటా దీపావళికి ముందు పలుశాఖలు అప్రమత్తంగా పనిచేస్తాయి. అనుమతి లేకుండా టపాసుల విక్ర యంపై నిషేధం ఉంది. అయితే నిబంధనలు అరకొ రగా అమలు అవుతున్నాయని విమర్శలు వినిపిస్తు న్నాయి. పైగా ప్రభుత్వం నిర్దేశించిన మైదానాల్లో మాత్రమే విక్రయించాలి. ఒక షాప్ నుంచి మరో షాప్‌కు కొంత ఖాళీస్థలం ఉండాలి. పైగా అగ్నిమాపక సురక్షిత వస్తువులు అందుబాటులో ఉండాలనే నిబం ధన ఉంది. రెండేళ్లక్రితం మైదానాలలో కొనుగోలు చేసి ఎక్కడ పడితే అక్కడ కాల్చకుండా నిర్దేశించిన స్థలా లలో మాత్రమే కాల్చాలనే నిబంధన ఉండేది. కానీ ఆచరణలో మాత్రం ఇది ఎప్పుడూ సాధ్యం కాలేదు. టపాసులు కొనుగోలు చేసినవారు సాధారణంగా వారి ఇళ్లవద్దనే కాల్చుకుంటు న్నారు. ఎన్ని షరతులు విధించినా నగరంలోని సుల్తాన్‌పేటలో సుమారు ఆరేడు జిల్లాలకు సరి పోయేంత బాణాసంచా ప్రముఖ కేంద్రం ఉంది. పలుమార్లు అధికారులు దాడులు చేసి మూయించినా గోడౌన్ల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.





మింటో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం

టపాసుల కొనుగోలుకు చీటీలు వేసే సంప్ర దాయం దాదాపు రాష్ట్రమంతటా ఉంది. ఇలా వివిధ జిల్లాలకు చెందిన చీటీ నిర్వాహకులు కోట్లాది రూపాయలు విలువైన టపాసులను వారు సిద్ధం చేసుకున్న గోడౌన్లకు తరలించారు. అక్కడ విక్రయాలు ఉండవు. కేవలం పంపిణీ మాత్రమే ఉంటుంది. రాష్ట్రంలో టపాసుల తయారీ కేంద్రం ఒక్కటి కూడా లేకపోయినా ఏకంగా 1400 కంపెనీలు లైసెన్స్‌లు పొందాయి. కర్ణాట కకు తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి అత్యధికంగా బాణాసంచా వస్తుంది. వయా హోసూరుకు వచ్చే టపా సులు అక్కడనుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తర లుతాయి. హరిత టపాసులు అంటే సాధారణ టపాసుల తరహాలో కాలుష్యం ప్రమాణం తక్కువగా ఉంటుంది. టపాసు పేల్చినప్పుడు వచ్చే పొగలో గంధకం ఆక్సైడ్ (ఎస్‌ఓ2), (ఎన్‌ఓ2)లు భారీ కాలుష్యం ఉండదు.

జాగ్రత్తలు తప్పనిసరి

దీపావళి పండుగ అంటే కొత్త బట్టలు వేసుకుని లక్ష్మీ పూజ చేసి సాయంత్రం ఇంటిముంగిట దీపాలు వెలి గించి టపాసులు కాల్చే సంప్రదాయం ఉంది. పెద్దలు టపాసులు వద్దనుకుంటున్నా చిన్నారులు మాత్రం ఆ వెలుగులు, శబ్దంతోపాటు ఆసక్తి చూపుతారు. టపాసులు కాల్చేవేళ వాటి లేబుళ్లపై ఉండే జాగ్రత్తలు పరిశీలించుకో వాలి. ఐఎస్‌ఐ ట్రేడ్‌మార్క్‌ను చూసుకోవాలి. కనీసం 2-3 అడుగుల దూరం పాటించేలా ఉండాలి. కళ్లకు జాగ్రత్తగా అద్దాలు వాడాలి. మహిళలు, చిన్నారులు టపాసులు కాల్చేవేళ పెద్దలు పర్యవేక్షించాలి. టపాసులు నిప్పుర వ్వలు కళ్లను తాకితే రుద్దుకోరాదు. చల్లటి నీటితో కడు క్కుని డాక్టర్ల వద్ద పరిశీలించుకోవాలి.

జనమంతా హోసూరు వైపే..

తమిళనాడులోని శివకాశి నుంచి దక్షిణభారత్ వ్యాప్తంగా టపాసులను సరఫరా చేస్తారు. తమిళనాడులోని చివరిప ట్టణం హోసూరులో దశాబ్దాలకాలంగా భారీగా టపాసుల విక్రయాలు కొనసాగుతాయి. బెంగళూరు నగరం శివారులోని చందా పుర నుంచి అత్తిబెలె వరకు రోడ్డుకు ఇరువైపులా బాణసంచా దుకా ణాలు తెరిచారు. రోడ్డుకు రెండువైపులా భారీగా దుకాణాలు వెలిశాయి. బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి టపాసులు కొనుగులో చేసేందుకు హోసూరు వెళ్తున్నారు.

కంటి ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగాలు

టపాసులు కాల్చేవేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని నగరం లోని పలు కంటి ఆసుపత్రులు ప్రత్యేకవార్డులను ఏర్పాటు చేసి పడ కలు సిద్ధం చేశారు. విక్టోరియా ఆసుపత్రికి అనుబంధంగా ఉండే మింటో కంటి ఆసుపత్రితోపాటు నారాయణ కంటి ఆసుపత్రులు, అగ ర్వాల్ కంటి ఆసుపత్రులు ప్రాంతాల వారీగా వారిశాఖలలో ప్రత్యేక బెడ్ లను సిద్ధం చేసి వైద్యనిపుణులను అందుబాటులో ఉంచారు.



సమస్యల నిలయం బీఎంసీఆర్‌సీ

● వైద్య విద్యార్థులకు అరకొర సౌకర్యాలు
● అధ్యాపకులు లేక కుంటుపడుతున్న బోధన

6

చింతామణిలో జోరు వర్షం


చింతామణి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలో శనివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రి దాకా కురిసింది. పలు లే అవుట్‌లు, రోడ్లు జలమయం అయ్యాయి. అంబాజీదుర్గపై నుంచి వర్షపునీరు నేరుగా రాజకాలువలు, డ్రైనేజీల ద్వారా వెళ్లాల్సి ఉండగా పూడిక, చెత్తా చెదారం వల్ల సజావుగా ప్రవహించలేదు. దీంతో వర్షపునీరు, మురుగునీరు కలసి రోడ్డుపై ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలలోకి భారీగా నీరు చేరింది. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.



మహిళా కళాశాల రోడ్డులో జలమయమైన రహదారి







జాలప్ప సహకారంతోనే రాజకీయంగా ఎదిగా



● శతజయంతి ఉత్సవాల్లో సీఎం

అన్ని సౌకర్యాలు పొంది ఆరోపణలు

● నగర పర్యటనలో మంత్రి డీకే శివకుమార్
● అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ

తెలుగు విజ్ఞాన సమితి ప్లాటినం వేడుకలకు కసరత్తు

వివరాలు 7లో..









కులగణన గడువు పొడిగింపు

బెంగళూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో కొన సాగుతున్న సామాజిక, విద్య, ఆర్థిక సర్వే ఈనెల 31వరకు పొడిగించారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లో సర్వే కుంటుపడింది, దీంతో బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా గడువు పొడిగించారు. సెప్టెంబరు 22న ప్రారంభమైన సర్వే అక్టోబరు 7లోగా పూర్తిచేయాలని తొలుత నిర్ణయించారు. అయితే సాంకేతిక సమస్యల వల్ల జాప్య మైంది. దీన్ని ఈనెల 18వరకు పొడిగిం చారు. బెంగళూరు మినహా ఇతర జిల్లాల్లో దాదాపు 95శాతం సమీక్ష పూర్త య్యింది. రామనగర, బీదర్, ధారవాడ లలో సర్వే 90శాతంకంటే తక్కువగా ఉంది. ప్రత్యేకించి బెంగళూరు నగరంలో సర్వే మందగతిన సాగుతోంది. ఇప్పటివ రకు 45శాతం మాత్రమే ఇళ్ల సమీక్ష పూర్తి చేశారు. ప్రస్తుతం దీపావళి సెలవులు రావడంతో సమీక్షను పొడిగించాలని నిర్ణ యించారు. ఈనెల 31లోగా తప్ప నిసరిగా సమీక్ష పూర్తి చేయాలని జిల్లా అధికారులకు సీఎం సూచిం చారు. కాగా సమీక్ష గడువు పొడి గించిన నేపథ్యంలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యా యులను సర్వే విధులనుంచి విముక్తి కల్పించారు. ఉపాధ్యా యలు మినహా ఇతరశాఖల సిబ్బందిని ఉపయోగించుకుని మిగిలిన సర్వే పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. దీపా వళి పండుగ నేపథ్యంలో ఈనెల 21 నుంచి 23వరకు మూడు రోజు లపాటు సమీక్ష ఉండదని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు.











తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.75	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5.183	36,910
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,202	36,799
నీటి నిల్వ (టీఎంసీలు)	78.97	101.50

దరోజీ వద్ద అరుదైన
స్కాప్స్ గుడ్లగూబ



అరుదైన స్కాప్స్ గుడ్లగూబ

బళ్లారి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భారతీయ స్కాప్స్ పేరుగలిగిన గుడ్లగూబ దరోజీ కరడిదామా ఆరణ్య ప్రాంతంలో ఆదివారం దర్శనమిచ్చిదిం. ఈ గుడ్లగూబ ప్రత్యేకంగా కనిపించడంతో పలువురు ఆసక్తిగా పరిశీలించారు. సుమారు 25 సెంటీమీటర్ల పొడవు ఉండి బూడిద రంగులో ఉంది. దీని కంటి ఉబ్బులు నలుపు రంగులో ఉన్నాయి. ఈ గుడ్లగూబను పగటి పూట గర్తించడం చాలా కష్టం, కరడి దామా ఏరియాలో ఈ గుడ్లగూబ వింత శబ్దంతో అరవడం, దీన్ని విన్న పక్షి పరిశీలకు మేలుకున్నారు. సీఎస్ రాయ్, శ్రీధర్ పెరుమాళ్, పంపయ్య స్వామి మాలియత్ ఈ గుడ్లగూబ అరుపును వింటూ కెమరాల్లో బంధించారు. ఇలాంటి గుడ్లగూబలు పశ్చిమ కనుమల్లో చాలా అరుదుగా కనిపిస్తాయని, బయలు ప్రాంతాల్లో ఇవి ఉండే అవకాశం ఉండదని, ఇదే తొలిసారి అని పరిశోధకులు తెలిపారు.

24న పొగాకు నియంత్రణపై
సమీక్షా సమావేశం

● ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పొగాకు నియంత్రణ సమీక్షా సమావేశం ఈనెల 24న నిర్వహించ నున్నట్లు అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్ తెలిపారు. శని వారం మీడియాతో మా ట్లాడిన ఆయన జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం కింద జిల్లాలోని అన్ని ప్రజా ప్రాంతాల్లో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం(కోట్పా) సమర్థవంతంగా అమలు చేయడంపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

సమస్యల నిలయం బీఎంసీఆర్‌సీ

● వైద్య విద్యార్థులకు అరకొర సౌకర్యాలు ● దంత కళాశాలలో బోధకుల కొరత ● సూపర్ స్పెషాలిటీలోనూ అందని సేవలు

బళ్లారి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి మెడికల్ సెంటర్ మరియు రీసర్చ్ సెంటర్(బీఎంసీఆర్‌సీ) పలు సమస్యలతో కొట్టుమిట్లాడుతోంది. వైద్య విద్యను అభ్యసిస్తున్న భవిష్యత్తు వైద్యులకు కనీస వసతులు కూడా కరువయ్యాయి. దంత కళాశాలలో బోధనకు లెక్చరర్లు కొరత తీవ్రంగ వేధిస్తోంది. పేరుకే సూపర్ స్పెషాల్టీ కానీ సౌకర్యాలు మాత్రం సాధారణ విభాగం కన్నా ఘోరంగా ఉన్నాయి. ఇక టెక్నికల్ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

● 1952లో వీఐఎంఎస్‌ను స్థాపించారు. 1999 మధ్య కాలంలో వీఐఎంఎస్ అటానమస్ బాడీగా ఏర్పడింది. అఖండ బళ్లారి జిల్లా విడిపోయి విజయనగర జిల్లా- బళ్లారి జిల్లాగా ఏర్పడ్డాయి. 2022-23 మధ్యకాలంలో వీఐఎంఎస్ పేరును బీఎంసీఆర్‌సీగా మారింది. ఆసుపత్రితో పాటు వైద్యకళాశాల కూడా ఇక్కడ ఉంది. దాదాపు 175 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి నిర్మించి ఉంది. బ్రిటీష్ వారి కాలంలో ఈ భవనాలను జైలుగా ఉపయోగించేవారు. స్వాతంత్ర్యం తర్వాత వైద్యశాలను ప్రారంభించారు. బిఎంసీఆర్‌సీ రాష్ట్రంలో ప్రత్యేక స్థానంగా నిలిచిన ఓ గొప్ప ఆసుపత్రి, కళాశాల

● ఇక్కడి సమస్యలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంతక ముందు ఉన్న వైద్యవిద్యార్థుల సీట్ల సంఖ్యను ఈ ఏడాది పెంచారు. గతంలో 200 సీట్లు ఉంటే ఇప్పుడు 250కి పెంచారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయలేదు. టీచింగ్ స్టాఫ్ కూడా పూర్తీగా తగ్గిపోయింది. ఇంత వరకూ టీచింగ్ స్టాఫ్‌ను వైద్యబోధన శాఖ కేటాయించలేదు. దంత వైద్య విభాగంలో యూజీ, పీజీ విద్యార్థులకు కూడా బోధకులు లేరు.



బీఎంసీఆర్‌సీ భవనం

అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కోర్సు ఎలా పూర్తి చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ట్రామాకేర్ లో ఏర్పాటు చేసిన సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి సేవలు రోగులకు అందుబాటులోకి రాలేదు. భవనం పూర్తీ చేశారు కానీ అవసరం అయిన సాంకేతిక పరికరాలు, టెక్నీషియన్లు, వైద్యులను నియమించలేదు. ఇలా అనేక సమస్యలతో బీఎంసీఆర్‌సీ ఆసుపత్రి మూలుగుతోంది. వైద్యవిద్యార్థులకు వసతులు లేకపోవడంతో బయట పీజీల్లో ఉండి తరగతులకు హాజరు అవుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవీరమ్మ కొండ

బళ్లారి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిక్కమంగళూరు జిల్లా మల్లెనహళ్లిలో బిండిగ దేవీరమ్మ కొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఏడాదిలో నరుక చతుర్థశి రోజు మాత్రమే దేవీరమ్మ కొండను భక్తులు ఎక్కడానికి అనుమతిసారు. శనివారం నుంచి జోరువాన కురుస్తోంది. ఆదివారం తెల్లవారు జామువరకూ వాన కురుస్తూనే ఉంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో పోలీసులు ఉదయం కొండపైకి అనుమతించారు. కొండ ఎత్తు ఎత్తుగా ఉన్నా భక్తులు కష్టపడి ఎక్కి అమ్మను దర్శించుకుంటారు. భక్తులు ఒకరి చేయి ఒకరు పట్టుకుని సహకారంతో కొండపైకి వెళ్లారు. దేవీరమ్మను దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చారని అధికారుల పేర్కొన్నారు.



కొండపై కిక్కిరిసిన భక్తులు

చిన్నచూపు..!

● పూర్తి కాని చిన్నమార్కెట్ పనులు
● నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
● వినియోగదారులు, వ్యాపారులకు ఇబ్బందులు



అపరిశుభ్రంగా మార్కెట్ ప్రాంతం

బళ్లారి, సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ వార్డు పరిధిలోకి వచ్చే గ్రాహం రోడ్డులో చిన్నమార్కెట్ ఉండేది, గతంలో ఇక్కడ చాలా సంవత్సరాలుగా కూరగాయలు, మాంసం మార్కెట్ ఉండేది. అయితే ఇటీవల కార్పోరేషన్‌లోని ఈ మార్కెట్ ప్రాతంలోని భవనాలు శిథిలావస్థకు చేరినందున వాటిని బీజేపీ ప్రభుత్వ హయంలో కూల్చివేసి కొత్త మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా అక్కడ పార్కింగ్ వ్యవస్థ కూడా కల్పిస్తామన్నారు. తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఇక్కడ మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేసి నెలలు గడిచిపోయాయి. కానీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈస్థలం పందులు, వీధికుక్కలు, వీధిపశువులకు ఆవాసంగా మారింది. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయితే వ్యాపారాలు చేసుకోవచ్చని వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. పనులు అడుగు కూడా కదలడం లేదు. పని నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయో లేదో తెలియదు. విడుదలైతే పని వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ నిర్మించి ప్రజలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మార్కెట్ పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు.



బంతిపూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అమాంతం పెరిగిన పూల ధరలు

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరంలోని ప్రముఖ సర్కిళ్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రముఖ సర్కిల్లో మట్టిదీపాలు, పూజసామాగ్రి పూలు, పండ్లు కొనుగోలు చేస్తున్నారు. దీపావళి అంటే పూల పండుగ బంతిపూలకు విపరీతమైన గిరాకీ. దీంతో పూలధరలు అమాంతం పెరిగిపోయాయి. నగరంలోని దుర్గమ్మ ఆలయం వద్ద పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు, అనంతపురం రోడ్డు సంఘం సర్కిల్లో మట్టిదీపాలను కొనుగోలు చేస్తున్నారు. పండుగ సందర్భంగా బంతి పూలు కిలో వందకుపైగా పలుకుతుంది. ఇతరపూల ధరలు కూడా ధరలు పెరిగాయి.

ఇసుక లారీల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న లారీలు

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివాంర విజయనగరం జిల్లా హూవినహడగలి, ఇట్టిగి రహదారిపై నిబంధనలను ఉల్లంఘించి ఇసుక రవాణా చేస్తున్న నాలుగు టిప్పర్ లారీలను ప్రాంతీయ రవాణా అధికారులు సీజ్ చేశారు. అలబూరు స్టాక్ యార్డ్ నుంచి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను అధికారులు ఆపి తనిఖీ చేయగా, అవి సామర్థ్యానికి మించి ఇసుకను రవాణా చేస్తున్నట్లు తేలింది. హవేరి, గడగ్, హుబ్బళ్ళి ప్రాంతాలకు ఇసుక రవాణా చేయడానికి పర్మిట్లు ఉన్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిర్దిష్ట సమచారం ఆధారంగా ప్రాంతీయ రవాణా అధికారి దామోదర్ మార్గదర్శకత్వంలో ఈ దాడి నిర్వహించినట్లు మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ మహ్మద్ షరీఫ్ షేక్ తెలిపారు. సిబ్బందిలో డి. ప్రభు తదితరులున్నారు.

సర్వేలో సమస్యల వెల్లువ



సర్వే వివరాల నమోదులో అంగన్‌వాడీ కార్యకర్తలు

కంప్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుపరిచిన సర్వే విధానం పూర్తి కాక తాలుకా అధికారులు సతమతమవుతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటింటా చేపట్టే సర్వే విధానంలో సర్వే చేపడుతున్న సిబ్బందికి గ్రామాల్లోని ప్రజలు సరైన సమాచారం ఇవ్వక, ఇళ్లలో లేక సర్వేల్లో కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తాలుకా ఈఓ శ్రీకుమార్ తెలిపారు. ఈ సర్వేలో శిశు సంక్షేమ శిక్షణ శాఖ రెవెన్యూ శాఖ తాలుకా పంచాయతీ శాఖ, శాఖలు అధికారులు సిబ్బంది పూర్తి స్థాయిలో సెప్టెంబరు 22న ప్రారంభం చేపట్టారు. ఈ ఆదివారం తాలుకా పంచాయతీ కార్యాలయంలో పురసభ ప్రాంగణంలో ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని సర్వేలో తప్పిన ఇళ్లను సర్వే చేపడుతూ తాలుకా అధికారులకు సమాచారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, వార్డెన్ బీసీఎం గాదెలింగప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ కార్యాలయాలు సిబ్బంది పాల్గొన్నారు.

అనుష్టాన సమితి సభ్యుడిగా జాఫర్ సాదిక్



కంప్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా అల్పసంఖ్యాకుల వాక్ఫ్ అనుష్టాన సమితి సభ్యుడుగా జాఫర్ సాదిక్ ఎన్నికైనట్లు కార్యదర్శి ఎస్ ఏజాస్ పాష ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం కంప్లి పట్టణంలో జాఫర్ సాదిక్ అనుష్టాన సమితి సభ్యుడుగా ఎన్నిక కావడంతో పట్టణంలోని పలువురు వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జాఫర్ సాదిక్ మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని వుంచి నాయకులు ఈ స్థానం కల్పించారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. రానున్న రోజుల్లో తమ నాయకుడు ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి గెలుపుకు నాంది పలుకుతానని తెలిపారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీమంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా గ్రామంలో నూతన వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నాగేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భగా నాగేంద్ర మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి రామాయణాన్నితోపాటు గ్రంథాలను ఎన్నో రాశారని ఆయన భావాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు భైరా దేవనహళ్లి, సత్యనారాయణరెడ్డి కార్పొరేటర్ హనుమంత, గుమ్మనూరు జగన్, అఖండ కర్ణాటక వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు జోళదరాసి తిమ్మప్ప, నాగలకేరి గోవిందు, ఆసిఫ్ సోము హగరి గోవిందు వీకే బసప్ప నాగరాజు, మోకా గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీ వెంకటేష్, మాజీ అధ్యక్షులు పత్తారు వెంకటేష్, రామాంజి, పుండుకూరు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

855 కిలోల గుట్కా.. మూడు కార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు, కార్లు

హోసూరు (క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా హోసూరులో పోలీసులు గస్తీని పెంచారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలలో మూడుకార్లనుంచి 855 కిలోల గుట్కా, కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హోసూరు సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో పోలీసులు నగరంలోని అమీరియా జంక్షన్ సమీపాన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కారును తనిఖీ చేయగా నిషేధిత 557 కిలోల గుట్కా, 48 ప్యాకెట్ల కర్ణాటక మద్యం గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన శ్యామ్‌సుందర్(27)ను అరెస్టు చేశారు. అలాగే హోసూరు టౌన్ పోలీసులు రాయకోట్టై రోడ్డు జంక్షన్‌లో తనిఖీల సందర్భంగా అక్కడ పార్క్ చేసిన కారును పరిశీలించారు. అందులో 110 కిలోల గుట్కా, 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సిప్‌కాట్ పోలీసులు జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో 188 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి కోయంబత్తూరు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. కోయంబత్తూరు వాసి ఇమ్మానుయేల్ (47)ను అరెస్టు చేశారు. ఇలా వేర్వేరు కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేసి భారీగా గుట్కా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు



ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే నేత మునుసామి

హోసూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 2026 శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే గెలిస్తే హోసూరు నగర అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ప్రాజెక్టు నివేదిక రూపొందిస్తామని పార్టీ డిప్యూటి జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్యే మునుసామి అభిప్రాయపడ్డారు. బాగలూరు రోడ్డులోని కృష్ణగిరి వెస్ట్ జిల్లా కార్యాలయం సమీపాన అన్నాడీఎంకే 54వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఏడు దశాబ్దాలలో కామరాజ్, అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, పురచ్చితలైవి అమ్మ తమిళనాడును చక్కగా పాలించారన్నారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చాక రూ.4.50లక్షల కోట్లు అప్పు మిగిలిందన్నారు. అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాక హోసూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

హోసూరులో దీపావళి సందడి

హోసూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని నగరంలోని మార్కెట్ ప్రాంతాలు రద్దీగా ఉన్నాయి. బాణాసంచా కొనుగోళ్లకు దుకాణాల వద్ద సందడి నెలకొంది. పూలు, పండ్లధరలు పెరిగినా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. లక్ష్మీదేవి పూజకోసం అవసరమైన పూలు, పండ్లు కొనుగోలు చేశారు. ఒక కిలోబంతిపూలు రూ.120 నుంచి రూ.200వరకు పలికింది. గుండుమల్లి రూ.600నుంచి 900వరకు ఉండగా కనకాంబరం కిలో రూ.వెయ్యి, బటన్‌రోజ్ రూ.80 పలికింది. హోసూరు బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొంది.



కిటకిటలాడుతున్న మార్కెట్ వీధి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



సత్యనారాయణ పేటలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణ పేట రైల్వే వంతెన సమీపంలో అభివృద్ధి పనులకు ఆదివారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి భూమిపూజలు నిర్వహించారు. సత్యనారాయణ పేటలోని 19వ వార్డు కూల్ కార్నర్ సర్కిల్ నుండి ఇందిరా సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫైబర్ ఏర్పాటు సుందరీకరణ చేపట్టారు. సత్యనారాయణ పేటలోని రైల్వే దిగువ వంతెన అభివృద్ధి, 21వ వార్డు చైతన్య కళాశాల వెనుక ఉన్న రోడ్డు, డ్రైనేజీ పనులు భూమి పూజలు చేసి ప్రారంభించారు. మాజీ మేయర్ రాజేశ్వరి, ఏఈఈ బసవరెడ్డి కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, కాంగ్రెస్ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ



చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నడవాలని మత్స్యకారులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ మత్స్యకారుల శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు చేపపిల్లల పెంపకంలో భాగంగా చేపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్లు శివణ్ణ, భావన, తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్, పంచాయతీ మేనేజర్లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కాళికాదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పురస్కరించుకుని ఆదివారం కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన కాళికాదేవికి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరాచార్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సమాజం అధ్యక్షులు మౌనేష్ ఆచారి, ఆలయ కమిటీ పదాధికారులు నాగరాజ, పంపాపతి, ఉచ్చీరప్పాచారి, భక్తులు పాల్గొన్నారు. పండగ సందర్భంగా భక్తులు భారీగా తరలిరానున్నారు.

అవమానించిన వారిని శిక్షించాలి: సర్వధర్మ సంఘం

సిరుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయిని అవమానించిన రాకేష్ కిషోర్‌ను దేశం నుంచి వెలివేయాలని, కఠినంగా శిక్షించాలని సర్వధర్మ సంఘం గౌరవాధ్యక్షుడు బీఎం సతీష్ డిమాండ్ చేశారు. శనివారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ న్యాయమూర్తిపై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం సరి కాదన్నారు. ఈ ఘటన న్యాయవ్యవస్థపై దాడి చేయడమేనన్నారు. తక్షణమే ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సర్వధర్మ సంఘం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు కొడ్లి మల్లికార్జున మాట్లాడుతూ కేంద్రం తక్షణమే కిషోర్‌ను దేశం నుంచి వెలివేయాలన్నారు. ముందు రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత వుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం అధ్యక్షుడు దమ్మూరు, సోమప్ప, కరిబసప్ప, చలవాది మహాసభ అధ్యక్షులు సన్న రామయ్య, గణేష్, ధర్మ సంఘాల పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఏఈ హనుమంతప్పకు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే రాకేష్ కిషోర్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శేషేంద్రశర్మ (జయంతి)



'యుగకవి'గా ప్రసిద్ధి చెందిన సాహితీ విమర్శకుడు శేషేంద్రశర్మ 1927 అక్టోబరు 20న నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడులో జన్మించారు. సాహితీవేత్త, వక్త. సంస్కృత, తెలుగు, ఆంగ్లభాషల్లో పండితుడు. ఆధునిక సాహిత్యంపై తనదైన ముద్రవేసి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. 'నా దేశం - నా ప్రజలు' రచన 2004లో నోబెల్ సాహిత్యానికి నామినేట్ అయ్యింది. 2007 మే 30న కన్నుమూశారు.

రాజబాబు (జయంతి)



'శతాబ్దపు తెలుగు హాస్యనటుడు'గా పేరొందిన రాజబాబు 1937 అక్టోబరు 20న రాజమండ్రిలో జన్మించారు. పూర్తిపేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. నటుడు, నిర్మాతగా రాణించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా ఆరంభించి నాటక రంగం నుంచి వెండితెరపై సత్తా చాటుకున్నారు. 'రాజబాబు-రమాప్రభ' జోడి మంచి హాస్యజంటగా పేరొందింది. వరుసగా ఏడుసార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన హాస్యనటుడు. 20ఏళ్లలో 589 సినిమాలలో నటించారు. 10 నంది అవార్డులు, 15 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1983 ఫిబ్రవరి 14న కన్నుమూశారు.

వీరేంద్రసెహ్వాగ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' అవార్డు గ్రహీత వీరేంద్రసెహ్వాగ్ 1978 అక్టోబరు 20న హర్యానాలో జన్మించారు. క్రికెట్‌లో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా సత్తా చాటుకున్నారు. ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టుకు, ఢిల్లీ రంజీ జట్టుకు వైస్ కేప్టెన్‌గా, కేప్టెన్‌గాను వ్యవహరించారు. భారతజట్టుకు కొంతకాలం కేప్టెన్సీ బాధ్యతలు వహించారు. వన్డే మ్యాచ్‌లోనూ, అంతర్జాతీయ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ త్రిపుల్ సెంచరిచేసిన ఘనత. అర్జున అవార్డుతోపాటు పలు ట్రోఫీలు పొందారు.'విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్'గా 2008, 2009లో తొలిగౌరవం పొందిన భారత క్రికెటర్. 2023లో ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే

ఆర్ఎస్ఎస్ వివాదం

● ఎంపీ యదువీర్



బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆర్ఎస్ఎస్ అంశాన్ని తెరపైకి తెచ్చిందని మైసూరు ఎంపీ యదువీర్ అభిప్రాయపడ్డారు. కొడగు జిల్లా మడికేరిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సంఘం వందేళ్లుగా సమాజసేవ చేసుకుంటూ వస్తోందని, శతాబ్ది ఉత్సవాలను అంతటా నిర్వహిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం తన వైఫల్యాలను దాచేందుకు ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా సిద్ధమైందన్నారు. ప్రభుత్వస్థలాల్లో నిర్వహించే కార్యక్రమాలకు కొన్ని నియమాలు అవసరమని అది సమస్య కాదని, ప్రభుత్వం నియమనిబంధనలు విధిస్తే అందుకు అనుగుణంగా అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఒక రోడ్డును అభివృద్ధి చేసేందుకు సాధ్యం కావడం లేదని, అయితే అభివృద్ధిని పట్టించుకోకుండా ఇలాంటి అంశాలపై దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. పీడీఓ సస్పెన్షన్‌పై స్పందిస్తూ అందరికీ వాక్ స్వాతంత్ర్యం, అభివ్యక్తి స్వాతంత్ర్యం ఉంటుందన్నారు. కాంగ్రెస్‌వారికి తమ సిద్ధాంతాలు నచ్చవని అంతమాత్రాన ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. తమ తీరికవేళల్లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారిపై చర్యలు సరికాదన్నారు. దీన్ని తాను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్ ర్యాలీలో

జెస్కాం ఉద్యోగి

● సస్పెండ్ చేయాలని డిమాండ్

రాయచూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుల్బర్గా విద్యుత్ సరఫరా సంస్థ(జెస్కాం) ఉద్యోగి వీరనగౌడ ఆర్ఎస్ఎస్ ర్యాలీలో పాల్గొని తన వాట్సాప్ స్టేటస్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ చేశారని సామాజిక కార్యకర్త శివకుమార్ జంగ్లి ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు శివకుమార్ జెస్కాం ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లకు ఫిర్యాదు చేశారు. జెస్కాం శక్తినగర్ సబ్ డివిజన్‌కు చెందిన మీటర్ రీడర్ వీరనగౌడ సంఘ్ యూనిఫాం ధరించి, చేతిలో లాఠీ పట్టుకుని ఆర్ఎస్ఎస్ శతాబ్ది ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నాడని, అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరనగౌడ తన వాట్సాప్ స్టేటస్‌లో సంఘ్‌ను నిషేధిస్తామని చెప్పిన వారు మట్టిగా మారిపోయారు సంఘ్ ఒక్కటే తన పని తాను చేసుకుంటూ వంద సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుందంటు స్టేటస్ పోస్ట్ చేశాడని శివకుమార్ జంగ్లి ఆరోపించారు.

నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

ధర్మవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు తప్పక పాటించి విక్రయాలు జరపాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ టపాసుల విక్రయదారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని ఆయన.. సిబ్బందితో కలిసి పరిశీలించారు.

అన్ని సౌకర్యాలు పొంది ఆరోపణలు

● నగర పర్యటనలో మంత్రి డీకే శివకుమార్ ● అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ



వీరయోధ ఉద్యానవనంలో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో దశాబ్దాలుగా సకల సౌకర్యాలు పొందినవారే ప్రస్తుతం ట్వీట్‌లతో ఆరోపిస్తున్నారని, నగరానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. కోరమంగలలోని వీరయోధ ఉద్యానవనంలో ఆదివారం బెంగళూరు నడక కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్కును సందర్శించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీఎం మాట్లాడుతూ బెంగళూరు అభివృద్ధికి 1.04 లక్షల కోట్లు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రజాసంక్షేమానికి ఏటా లక్షకోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. నగరంలోని ఏ రోడ్డులోనైనా గుంత ఏర్పడితే మొబైల్ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చే ప్రక్రియను దేశంలో తొలిసారి బెంగళూరులోనే అమలు చేశామన్నారు. తాను విమర్శలను స్వాగతిస్తానన్నారు. ప్రజాప్రభుత్వంలో విమర్శలు అవసరమన్నారు. కానీ కొందరు పనిగట్టుకుని విమర్శలు చేసేవారిని పట్టించుకోనన్నారు. సేవ చేసేందుకే ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. మా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అయ్యిందని, మేం చేసిన పనులు ప్రజలకు తెలుసని, ప్రతిపక్షాలకు కూడా తెలుసునన్నారు. సమస్యలు అనేవి బెంగళూరులో మాత్రమే కాదని అన్ని నగరాలలో ఉన్నాయన్నారు. ప్రజల చెంతకు ప్రభుత్వం వెళ్లాలనే ఐదు పాలికెలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు పాలికెల ద్వారా 369 వార్డులుగా విభజించామన్నారు. ప్రారంభంలో విమర్శలు వచ్చినా గ్రేటర్ బెంగళూరు అథారిటీకి ప్రతిపక్షాలు సహకరించాయన్నారు. నగరంలో రోజూ 3వేలకొత్త వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయని, నగర జనాభా 1.40 కోట్లకు పెరిగిందన్నారు. లక్షలాదిమంది రోజూ నగరానికి వచ్చి వెనుతిరుగుతున్నారన్నారు. ఐటీబీటీ కంపెనీల సీఈఓల సభ జరిపే విషయమై మంత్రులు ప్రియాంక ఖర్గే, ఎంబీ పాటిల్‌తో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

తెలుగు విజ్ఞాన సమితి ప్లాటినం వేడుకలకు కసరత్తు



సమావేశంలో ప్రసంగిస్తున్న సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు విజ్ఞాన సమితి ఏర్పడి 73 ఏళ్లు పూర్తి అవుతున్న తరుణంలో మరో రెండేళ్లలో జరిగే ప్లాటినం జుబ్లీ వేడుకలకోసం ఇప్పటినుంచి కసరత్తు ప్రారంభించాలని తీర్మానించారు. ఆదివారం వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ ప్లాటినం జుబ్లీ సందర్భంగా వందమంది కొత్త సభ్యులను చేర్చుకోవాలని తీర్మానించారు. శివాజీనగర్ తెలుగుపాఠశాల విద్యార్థులకు యూనిఫాం, బస్సుపాసులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు కార్యవర్గ సభ్యుడు గణేశ్ శంకర్ రూ.50వేలు విరాళం అందజేశారు. ఇటీవల మృతి చెందిన తెలుగు ప్రముఖులకు సంతాపం తెలిపారు. పీఈఎస్ సంస్థల వ్యవస్థాపకులు ఎంఆర్ దొరస్వామి, బెంగళూరు యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు తంగిరాల వెంకట సుబ్బారావు, హెచ్‌ఏఎల్ తెలుగు సాహిత్య సమితి మాజీ అధ్యక్షుడు తోట వీర్రాజు, రెడ్డిజనసంఘం అధ్యక్షుడు కేపీ ముని వెంకటరెడ్డి, బీ చిన్నస్వామి శెట్టి మృతికి సంతాపం తెలిపారు. ఉపాధ్యక్షుడు ఆదికేశవులునాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, సీఏ వరదరాజు, చంద్రమోహన్, లక్ష్మీశరత్‌తోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

» ఆర్యవైశ్య అభివృద్ధి మండలి అధ్యక్షుడు కేవీ రామప్రసాద్



రామప్రసాద్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముళబాగిలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య సముదాయ అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో స్వయం ఉపాధికోసం రుణం, విద్యార్థుం, వాసవి జలశక్తి, ఆహార వాహిని వంటి వినూత్న పథకాలు ఉన్నాయని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు కేవీ రామప్రసాద్ అభి ప్రాయపడ్డారు. పట్టణంలోని పురాణ ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయంలో విశేషపూజల అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులచే సన్మానం స్వీకరించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 4.59 లక్షలమంది ఆర్యవైశ్యులు ఉన్నారని, ఆర్థికంగా వెనుకబడినవారికి అనుకూలమయ్యేలా ప్రత్యేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఏటా మండలికి రూ.10కోట్లు ఇస్తోందని, అయితే ఈ గ్రాంటు చాలడం లేదన్నారు. మరింత గ్రాంటు పెంచాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. తాను కాంగ్రెస్‌లో 40ఏళ్లుగా ఉన్నానని, ప్రస్తుతం కేపీసీసీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించానని, తన కార్యదక్షతను గుర్తించి మండలి అధ్యక్షుడిగా అవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రగౌడ, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ, పీఎల్‌డీ బ్యాంకు ఉపాధ్యక్షుడు మండికల్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనలు పల్లెకు చేరాలి

» ఐసీఏఆర్ సంస్థాపక దినోత్సవంలో కేంద్రమంత్రులు



రైతులకు సన్మాన కార్యక్రమంలో కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనలు పల్లెకు చేరాలని అప్పుడే అన్నదాతలకు కొత్తశక్తిని ఇచ్చినట్లు అవుతుందని కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజెలు వెల్లడించారు. యలహంకలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) 33వ సంస్థాపక దినోత్సవం ఆదివారం జరిగింది. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, సంస్థ డైరెక్టర్ ఎస్ఎన్ సుశీల్‌తోపాటు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మూడో బయోకంట్రోల్ ఎక్స్‌పో నిర్వహించారు. పలు కీటకాల ప్రయోగాలకు సంబంధించిన స్టాల్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల సాధక అన్నదాతలను సత్కరించారు.

క్వాంటమ్ సమ్మేళనానికి ఆహ్వానం

బెంగళూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగే క్వాంటమ్ సమ్మేళనానికి ప్రముఖ క్వాంటమ్ శాస్త్రవేత్త ఆండ్రియాజ్ వాల్‌రాఫ్‌ను సాదరంగా స్వాగతించారు. ప్రపంచ అగ్ర పరిశోధనా సంస్థ ఈటీహెచ్ జ్యూరిక్ క్వాంటమ్ సెంటర్‌ను ఆదివారం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బోసరాజు సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ ఆండ్రియాజ్‌తో చర్చలు జరిపారు. క్వాంటమ్ సమ్మేళనంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంత్రివెంట అధికారులు ఉన్నారు.



శాస్త్రవేత్తలతో మంత్రి బోసరాజు చర్చలు

నగరసభ ఎన్నికలకు సన్నద్ధం కండి

» సభ్యులకు ఎమ్మెల్యే నరసింహస్వామి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రానున్న నగరసభ ఎన్నికల్లో గెలుపు సాధించడం అంత సులభం కాదని, పట్టణంలో ఉత్తమరీతిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఎన్నికలను ఎదుర్కోనాలని ఇప్పటినుంచి సన్నద్ధం కావాలని సభ్యులకు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని నగరసభ కార్యాలయంలో ఆధునీకరించిన సభాంగణాన్ని ప్రారంభించి మాట్లాడారు. పురసభను నగరసభగా పదోన్నతి కల్పించడం ద్వారా ఎన్నోఏళ్లుగా కలగా ఉండేదని, ఇది పట్టణాభివృద్ధికి సహకారిగా ఉందన్నారు. పురసభ సభ్యులు సమావేశం నిర్వహించడానికి స్థలం కొరత ఉండేదని, తాలూకా పంచాయతీ సభాంగణం లేదా పీఎల్‌డీ బ్యాంకులో సభ నిర్వహించాల్సి న అనివార్యత ఉండేదన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రికి విన్నవించగా మంజూరైన గ్రాంట్లలో రూ.50లక్షలతో పురసభ సభాంగణాన్ని ఆధునీకరించినట్టు తెలిపారు. రూ.5కోట్లతో మైనారిటీలు ఉండే టిప్పునగర్, సేట్ కాంపౌండ్, మరగల్ తదితర ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామన్నారు. రూ.1.20 కోట్లతో గంగమ్మపాళ్య అంబేడ్కర్ సర్కిల్‌నుంచి రైల్వే ట్రాక్ వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీవ్యవస్థను కల్పించనున్నట్టు తెలిపారు. పురసభ బస్టాండ్, రంగమందిర, ఇన్‌డోర్ స్టేడియం పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు గ్రాంట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలోని కేంద్రభాగంలో ఉండే పట్టాభిషేక ఉద్యానవనాన్ని ఆధునికశైలిలో అభివృద్ధి చేసేందుకు రూ.3కోట్లు మంజూరైందన్నారు. పనులు చేపట్టేముందు పాత, దుస్థితిలో ఉన్న చెట్లను తొలగించదలించడానికి సిద్ధంకాగా న్యాయాధికారికి ఫిర్యాదు చేయడంతో ఈ ప్రక్రియ ఆగిందన్నారు. ఉద్యానవనంలో జిమ్ చేసేందుకు ఆధునిక హైడ్రాలిక్ ఉపకరణాలు అమర్చనున్నట్టు తెలిపారు. పార్కులో వాకింగ్ చేసేవారికి అల్పాహార క్యాంటీన్ సౌలభ్యం కల్పించదలిచామన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా శౌచాలయాలు నిర్మిస్తామన్నారు. పట్టణంలో ఆక్రమణలకు గురైన ఫుట్‌పాత్‌ను తొలగించి ఉత్తమ సీసీ రోడ్లు, ఫుట్‌పాత్‌ను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పట్టణ వ్యాప్తంగా రూ.15కోట్లతో యూజీడీ పనులతోపాటు అన్ని వార్డులలో యరగోళ్ జలాశయం నుంచి నీటి కనెక్షన్లు ఇస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం నారాయణస్వామి, తహసీల్దార్ కేఎన్ సుజాత, పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు నాగవేణి మంజునాథ్, మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, షంషుద్దీన్‌బాబు, ఫర్జానా సుహేల్ తదితరులు పాల్గొన్నారు.





దీపావళి నేపథ్యంలో నగరంలో ఆదివారం రాత్రి బళ్ళారి రోడ్డులో ట్రాఫిక్‌జామ్ నెలకొంది. ప్యాలెస్ గ్రౌండ్స్ నుంచి హెబ్బాళ ఫ్లై ఓవర్‌దాకా వాహనాల రద్దీ ఉంది. **(ఆంధ్రజ్యోతి, బెంగళూరు)**

జాలప్పతోనే రాజకీయంగా ఎదిగా

● ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



సన్మాన గ్రహీతలతో సీఎం సిద్ధరామయ్య

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాను రాజకీయగా ఎదిగేందుకు, మంత్రి అయ్యేందుకు ఆర్ఎల్ జాలప్ప కూడా కారణమని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. జాలప్ప శతజయంతి సందర్భంగా ఆదివారం జాలప్ప అకాడమీ, జాలప్ప లా వర్సిటీ, శతమానోత్సవ భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. దేవరాజ్ అరసు వసతి పాఠశాల నూతన భవనాలకు శంకుస్థాపన చేశారు. ఏహృదయవంత ఆర్ఎల్ జాలప్ప జీవనపథ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జాలప్ప వాస్తవాన్ని కఠినంగా చెప్పేవారన్నారు. ఆయన వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనదని, మనస్ఫూర్తిగా స్పందించేవారన్నారు. సమయస్ఫూర్తితోపాటు చక్కటి పాలనా దక్షులని కొనియాడారు. నాలుగుసార్లు ఎంపీగా గెలుపొంది ఆయన నిర్వహించిన అన్నిశాఖలలోనూ తనదైన ముద్ర వేశారన్నారు. తాను రెవెన్యూ మంత్రి కాదలచుకున్నానని, అయితే ఆర్ఎల్ జాలప్ప ప్రోత్సాహంతోనే ఆర్థిక మంత్రి అయ్యానన్నారు. ఈకారణంగాను తాను 16సార్లు బడ్జెట్ సమర్పించగలిగానన్నారు. కాగా 150మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాసంస్థ ప్రస్తుతం 9వేలమంది వేర్వేరు విభాగాల్లో చదువుతున్నారని కొనియాడారు. ఇదే సందర్భంగా వివిధరంగాల సాధకులకు జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో బెంగళూరు గ్రామీణ ఇన్‌చార్జ్, పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్, పరిషత్ మాజీ సభాపతి సుదర్శన్, మాజీ మంత్రి పీజీఆర్ సింధ్యా, దొడ్డబళ్ళాపుర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు పాల్గొన్నారు.

కన్నడ సాహిత్యాభిలాష పెరగాలి



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

బెంగళూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): యువతలో కన్నడ సాహిత్యాభిలాష పెరగాలని వక్తలు పేర్కొన్నారు. బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్‌లో కన్నడవే సత్య ఫౌండేషన్ సాహితీ సభ్యుల పుస్తకాలను ఆవిష్కరించారు. కేఎస్ మహా బల రచించిన రెండు కృతులు 'నన్న అప్ప కేఎస్‌న', 'హాస్యాలాప'ల గురించి సాహితీవేత్త జీవీ అరుణ పరిచయం చేశారు. ఎల్ గిరిజా రాజ్ కవన సంకలనం 'చిరంతన భావబిందు', హెచ్ఎస్ శ్రీధర్‌రావ్ ప్రవాస కథ 'అయోధ్య-కాశి, భూతాన్ ఆధ్యాత్మిక ప్రవాస' రచనలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా సీనియర్ కవి బీఆర్ లక్ష్మణరావ్, కేఎస్ గణేశయ్య తదితరులు విచ్చేశారు. పెద్దసంఖ్యలో సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

పర్యావరణ దీపావళిపై జాగృతి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

శిడ్లఘట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పర్యావరణ హితంగా ఆచరించేలా పాటిద్దామంటూ జాగృతి నిర్వహించారు. గరుడాద్రి ఇంగ్లిష్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారీ శబ్దం వచ్చే, ఎక్కువ పొగ వచ్చే బాణాసంచా కాల్చరాదన్నారు. టపాసులు కాల్చేవేళ పెద్దల పర్యవేక్షణ ఉండేలా వ్యవహరించాలన్నారు. పండుగను కాలుష్యరహితంగా ఆచరిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గగనసింధ, డీఎస్పీ మురళీధర్, సీఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో పండుగ సందడి



మట్టిదీపాలు కొనుగోలు చేస్తున్న మహిళ

బాగేపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వెలుగులు పండుగ దీపావళి సందర్భంగా బాణాసంచాతోపాటు మట్టిదీపాల విక్రయాలు జోరందుకున్నాయి. పట్టణంలోని డీవీజీ రోడ్డులో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పండుగసామగ్రి పూలు, పండ్ల ధరలు పెరిగినా ప్రజలు ఆసక్తిగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మెయిన్‌రోడ్డుకు అనుబంధమైన దుకాణాలలో సందడి నెలకొంది. పట్టణ శివారులోని మినీ క్రీడా మైదానంలో బాణాసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చారు. కేవలం గ్రీన్ పటాకీలు అమ్మాలని సూచించారు. రూ.200 నుంచి 4వేల విలువైన బాక్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

గుండెపోటుతో అర్చకుడి మృతి

ధర్మవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నివశిస్తున్న ఎర్రబల్ల విజయ్‌కుమార్‌శర్మ (51) అనే అర్చకుడు ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. పట్టణంలోని ఎస్ఎల్‌వీ మార్కెట్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరాలయం, చెరువు కట్ట వద్ద వినాయక ఆలయం లో అర్చకులుగా పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ఉన్నఫలంగా నుస్తిగా ఉందని కుటుంబసభ్యులకు తెలపడంతో, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సూచనతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి గాయత్రి సంఘం, అర్చక సంక్షేమ సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఆశ, కుమార్తెలు శ్రేయ, జ్ఞానశ్రీ ఉన్నారు.